క్లుప్తంగా

రేపు విజయోత్సవ ర్యాలీ, సభ

కందుకూరు: మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేగా సబితారెడ్డి గెలుపొందిన సందర్భంగా ఆమెతో కలిసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కొత్తూర్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సబితారెడ్డి పారంభిస్తారని పేర్కొన్నారు. అక్కడి నుంచి కందుకూరు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించనున్నారని తెలిపారు. అనంతరం సామ నర్సింహారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో విజయోత్సవ సభ కొనసాగనుందని పేర్కొన్నారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో..) టమాటా రూ.21, వంకాయ రూ.55, బెండకాయ రూ.50, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.71, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 16, క్యారెట్ 40, దొండకాయ రూ.60, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ 60, దోసకాయ రూ.28, సొరకాయ రూ.17, పొట్లకాయ రూ.18, అరటి 09, చిక్కుడు 70, అర్వి 50, మునగ 95, చిలగడదుంప 45, బీట్‌రూట్ 25, కీర 13, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ రూ.70గా ఉన్నాయి. ఈ ధరలు గురువారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

మలబార్ 'మైన్' డైమండ్ ఆభరణాల ప్రదర్శన

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ చైతన్యపురిలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలో 'మైన్' డైమండ్ ప్రత్యేక ఆభరణాల ప్రదర్శనను బుధవారం సాయంత్రం ప్రారంభించారు. వినియోదారులు అమూల్య, పూజ, ఇంద్రజ, ఝాన్సీ, చందన, పుష్ప చేతుల మీదుగా వజ్రాభరణాల ప్రదర్శన ప్రారంభించినట్లు షోరూం హెడ్ రదీష్‌కుమార్ తెలిపారు. రోజూ ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్‌వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాలు, ప్లాటినం ఆభరణాలు అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రదర్శన డిసెంబర్ 31 వరకు ఉంటుందన్నారు. పాతమైన్ డైమండ్ ఆభరణాల మార్పిడిపై 100 శాతం విలువను పొందే అవకాశం, కొత్తగా కొనుగోలు చేసే డైమండ్ విలువపై 25 శాతం తగ్గింపు కల్పిస్తున్నామన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

చైతన్యపురి : దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్-2 ఆర్టీసీ డిపో నుంచి నడిచే బస్సు సర్వీసులకు సంబంధించి ప్రయాణికుల నుంచి సలహాలు, సమస్యలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు గురువారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్యలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఉద్గిర్, బీచ్‌కుండ్, జూకల్, కొల్లాపూర్, విజయవాడ, బైలడిల్లా, జగదల్‌పూర్, బెంగళూరు, తొర్రూర్ వెళ్లే బస్సులు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రయాణికులు నేరుగా డీఎంతో మాట్లాడవచ్చని తెలిపారు.

మల్‌రెడ్డికి వినతి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని రాందాస్‌పల్లి మాజీ సర్పంచ్ ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిబట్ల మున్సిపాలిటీలోని రాందాస్‌పల్లి, చింతపల్లిగూడకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. భారీ మెజార్టీతో గెలిపించినందుకు శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం పని చేసే వారికి న్యాయం చేస్తామని మల్‌రెడ్డి హామీ ఇచ్చారు.

మల్‌రెడ్డికి శుభాకాంక్షలు

యాచారం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి బుధవారం యాచారం గ్రామానికి చెందిన ముస్లింలు శుభాకాంక్షలు తెలిపారు. అజ్మీర్ దర్గాను దర్శించుకొని వచ్చిన ముస్లింలు ఎమ్మెల్యేను కలిసి ప్రసాదాన్ని అందజేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎండీ గౌస్ ఆధ్వర్యంలో రంగారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ సాజీద్, ఎండీ వలీ, ఎండీ సయ్యద్, సాలార్, అరుణ్‌ప్రసాద్, నందు, హకీమ్ పాల్గొన్నారు.

ఈకేవైసీ కోసం పడిగాపులు



హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఎదుట క్యూ కట్టిన మహిళలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని గ్యాస్ ఏజెన్సీ ఎదుట బుధవారం మహిళలు ఈకెవైసీ నమోదు కోసం బారులు తీరారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్న నేపథ్యంలో గ్యాస్ కనెక్షన్‌కు ఈకెవైసీ ఉంటేనే సబ్సిడీ వస్తుందని వదంతులు రావడంతో గ్యాస్ ఏజెన్సీ ఎదుట వినియోగదారులు పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు మాత్రం తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని ఈకెవైసీ నిరంతర ప్రక్రియ అని చెబుతున్నారు.

నేటి నుంచి దరఖాస్తులకు శ్రీకారం



బడంగ్‌పేట్: రాఘవేంద్ర కాలనీలో టెంట్ వేయడానికి స్థలాన్ని జేసీబీతో చదును చేయిస్తున్న అధికారులు



మహేశ్వరం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నర్సింహ



పహాడీషరీఫ్: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో సూరజ్ కుమార్

- 28నుంచి జనవరి 6వరకు స్వీకరణ
- కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు చర్యలు
- ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలన

బడంగ్‌పేట్: కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన అభయహస్తం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్, గుర్రంగూడ, బడంగ్‌పేట, కుర్మల్‌గూడ, మామిడిపల్లి, అల్మాస్‌గూడ, వెంకటాపూర్, మల్లాపూర్ తదితర పట్టణ పరిధిలోని 32 డివిజన్లల్లో దరఖాస్తులు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా పరిధిలోని వార్డు కార్యాలయాలు, ఆయా డివిజన్ల వార్డు కార్యాలయాలు అందుబాటులో లేని చోట కమ్యూనిటీ భవనాలు, డ్వాక్రా భవనాలను బడంగ్‌పేట కార్పొరేషన్ అధికారులు తమ పరిధిలో తీసుకుని అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు లేని డివిజన్లో ఓపెన్ స్థలాలను సేకరించి ఆయా చోట్ల జేసీబీలతో చదును చేయించి టెంట్లను వేస్తున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే లబ్ధిదారుల కోసం మంచినీటి సౌకర్యంతో పాటు ఇతర ఏర్పాట్లు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం: వంకాయల యాదగిరి (శానిటేషన్ ఇన్‌స్పెక్టర్)

కార్పొరేషన్ పరిధిలోని 32 డివిజన్లో ఆరు గ్యారెంటీ పథకాల అమలు కోసం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి రశీదును జారీ చేస్తారు. దీని కోసం ప్రభుత్వ భవనాలను, కమ్యూనిటీహాళ్లను, ఎంపిక చేసుకున్నాం. లేనిచోట్ల వేరే ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వం ఒక దరఖాస్తును విడుదల చేసింది దాని ప్రకారం ఫాలో అయితే సరిపోతుంది.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: అర్హులకు ఆరు గ్యారెంటీ పథకాల అమలు కోసం నేటి నుంచి చేపట్టే ప్రజా పాలన విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బి వెంకట్రామ్ సూచించారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కౌన్సిలర్లు, అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం నేటి నుంచి జనవరి 6వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఇందుకు గాను ప్రతీ వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధు మోహన్, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, శివకుమార్, అనిత, మౌనిక, పద్మ, తేజస్విని, విలాస్, హేమలత, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం: ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన కార్యక్రమ సభలో ప్రతిజ్ఞ్క్రూరా పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ నర్సింహ పేర్కొన్నారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు గ్యారంటీల పథకాలకు సంబంధించిన దరఖాస్తులను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో ఇవ్వాలన్నారు. దరఖాస్తులు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సమర్పించాలన్నారు. అర్హత కలిగిన వారు ఐదు పథకాలను దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునితా నాయక్, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్ పాల్గొన్నారు.

హుడాకాంప్లెక్స్: జీహెచ్ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం-5లో డిప్యూటీ కమిషనర్ అరుణ, ఆర్డీఓ సూరజ్‌కుమార్, పరిశ్రమల శాఖ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ సిబ్బంది, కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ప్రజాపాలన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని మండల గ్రౌండ్‌లోని వార్డు కార్యాలయం, వేంకటేశ్వరకాలనీ రోడ్ నెం-1 కమ్యూనిటీహాల్, చెరుకుతోటకాలనీ కమ్యూనిటీహాల్, డాక్టర్స్‌కాలనీ సీనియర్ సిటీజన్ భవనంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాస్ ఫొటో జత చేయాలని, రేషన్‌కార్డు లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎలాంటి రుసుము ఉండదని తెలిపారు.

ప్రజా పాలన విజయవంతం చేయాలి: మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు ఆరు గార్యెంటీ పథకాల అమలు కోసం నేటి నుంచి చేపట్టే ప్రజా పాలన విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. ఉదయం 9 గంటల నుంచి సాయత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశ్, ఏఈ కె.భార్గవ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పహాడీషరీఫ్: ప్రజా పాలనలో భాగంగా ఐదు గ్యారెంటీ పథకాల అమలు కోసం లబ్ధిదారులనుంచి దరఖాస్తు స్వీకరించాలని కందుకూర్ ఆర్డీవో సూరజ్ కుమార్ సిబ్బందికి సూచించారు. జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం నుంచి జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. మున్సిపాలిటీలోని ఒక్కో వార్డుకు మూడు కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయా కేంద్రాల వద్ద దరఖాస్తుదారులకు అసౌకర్యాలు కలగకుండా మున్సిపాలిటీల తరపున అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. మహాలక్ష్మీ, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రైతు భరోసా పథకాలకు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు ప్రతులను జతపరచాలన్నారు. తెల్లరేషన్ కార్డు ప్రతిని అందజేయని వారి దరఖాస్తు కూడా సిబ్బంది స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అబ్దుల్లా సాది, కమిషనర్ ఎస్ వసంత, కౌన్సిలర్లు బుడుమాల యాదగిరి, లక్ష్మీనారాయణ, శంకర్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ

మహేశ్వరం: మండల పరిధిలోని ఆకన్‌పల్లి గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాట్రావత్ కుమార్ నాయక్ స్వగృహంలో 18వ మెట్టు అయ్యప్ప మహాపడి పూజ వైభవంగా నిర్వహించారు. కిట్టు గురు స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలు, భక్తి గీతాలు ఆలపించారు. అయ్యప్పకు అభిషేకం, నవగ్రహ పూజ, పంచామృతాభిషేకం, కలష పూజ నిర్వహించారు. గంజి రమేశ్ కుమార్ పూజకు హాజరై అన్నదానం చేశారు. ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్, సర్పంచ్ ముక్కెర యాదయ్య, ఘట్టుపల్లి సర్పంచ్ కోరుపోలు అనితారెడ్డి, కల్వకోల్, ఎన్డీ తండా సర్పంచ్‌లు థామస్‌రెడ్డి, రాజు నాయక్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

'మహాలక్ష్మి'పై వినతి

మంచాల: ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం నిర్ణయాన్ని సవరించాలని ధర్మ సమాజ్ పార్టీ మంచాల తహసీల్దార్ వెంకట్ ప్రసాద్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ కేవలం తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి మాత్రమే ఉచిత ప్రయాణం అనుమతించాలన్నారు. ఉచిత ప్రయాణంతో ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు ప్రదీప్‌కుమార్, ప్రవీణ్, రంజిత్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

మంచాల: స్నేహితుడు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో అతడి కుటుంబానికి తోటి మిత్రులు అండగా నిలిచారు. మంచాల మండలంలోని జాపాల గ్రామానికి చెందిన నోముల పరమేశ్ (25) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం పరమేష్ కుటుంబ సభ్యులను 2006-07 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు పరామర్శించి రూ.42వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

రోడ్ల విస్తరణకు కృషి

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సబితారెడ్డి

మహేశ్వరం: గ్రామీణా ప్రాంతాల్లో రోడ్లను విస్తరించి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి-కోళ్లపడకల్ వయా ఘట్టుపల్లి బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మన్సాన్‌పల్లి- కోళ్లపడకల్ వయా ఘట్టుపల్లి డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.15.20 కోట్ల నిధులను తను మంజూరు చేయించి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించానని గుర్తు చేశారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయన్నారు. అసంపూర్తి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఘట్టుపల్లి ప్రభుత్వ పాఠశాలను ఆమె సందర్శించి విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. మన ఊరి-మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేశానన్నారు. విద్యార్థులు ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా నాయక్, ఘట్టుపల్లి సర్పంచ్ కోరుపోలు అనితారెడ్డి, ఉప సర్పంచ్ మేకల శ్రీనివాస్ యాదవ్, వార్డు సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, బి. రవి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్ర శంకరయ్య ప్రభాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మాడ్గుల: ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందించేందుకు ఈ నెల 28 నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాడ్గుల మండలం బ్రహ్మణపల్లి గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నారాయణరెడ్డిని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు గ్రామ సభలను వినియోగించుకోవాలని సూచించారు. అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, పార్టీలకు అతీతంగా అందరిని కలుపుకొని పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రాంరెడ్డి, పీసీసీ రాష్ట్ర నాయకుడు బాలాజీసింగ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, ఎంపీటీసీ పాండుగౌడ్, సర్పంచ్‌లు లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్

రిటైర్డు జడ్జి సాంబశివరావు



కేసులు పరిష్కరిస్తున్న సాంబశివరావు, సీఐ సైదులు

చేవెళ్ల: పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఉపయోగపడుతుందని రిటైర్డు జడ్జి సాంబశివరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసుల కోసం లోక్ అదాలత్ బుధవారం మూడో రోజు కూడా కొనసాగింది. రెండో రోజు 144 కేసులు పరిష్కరించబడినట్లు తెలిపారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనదారులపై నమోదైన కేసులను వెంటనే పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ నెల 30వ తేదీ వరకు లోక్‌అదాలత్ కొనసాగుతుందన్నారు. ఈ లోక్ అదాలత్‌లో ట్రాఫిక్ సీఐ సైదులు, ఎస్ఐ విఠల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఆలోచనలతో ముందడుగు

టెక్ మహీంద్ర వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ స్వామినాథన్ మణి

శంకర్‌పల్లి: విద్యార్థులు తమ భవిష్యత్‌కు సంబంధించి నూతన ఆలోచనలతో ముందడుగు వేయాలని టెక్ మహేంద్ర వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ స్వామినాథన్ మణి అన్నారు. శంకర్‌పల్లి మండలంలోని దొంతాన్‌పల్లి గ్రామ శివారుల్లోని ఇక్ఫాయి పౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం అమృత్ కాల్ విమర్స్ వికాసిత్ భారత్ 2047 పేరిట సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు తమ ఆలోచనలను ఇతరులతో పంచుకోవడం ఎంతో ముఖ్యం అన్నారు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకొనేందుకు ఉత్సాహం చూపాలన్నారు.

మాజీ ఎంపీని పరామర్శించిన నేతలు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డిని బుధవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు పరామర్శించారు. మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి తల్లి ఈశ్వరమ్మ దశదిన కర్మ హైదరాబాద్‌లోని వారి స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెళ్లిన నేతలు ఈశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, తాండ్ర శ్రావణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: అందరి సమిష్టి కృషి వల్లే ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ఇంతటి అఖండ విజయం సాధ్యమైందని నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన లక్ష్యమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. తన గెలుపు కోసం అహర్నిశలు కృషిచేసిన నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాలు, ఆయా సంస్థలు, తదితరుల కోసం బుధవారం వనస్థలిపురం డివిజన్ హస్తినాపురం జీఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన కృతజ్ఞతా సభా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేదని, కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతామన్నారు. ఎమ్మెల్సీలు ఎగ్గే మల్లేశం, దయానంద్ గుప్తా, ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, పలు విభాగాల చైర్మన్లు, డివిజన్ల అధ్యక్షులు, మహిళా నేతలు, యువత, పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సాయంకాలం మార్కెట్..

చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి

చేవెళ్ల: చేవెళ్ల వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతుల కోసం సాయంకాలం మార్కెట్ శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేవెళ్ల ప్రాంతంలోని రైతులకు అందుబాటులో మార్కెట్ సౌకర్యం కల్పించాలనే ఆలోచనతో సాయంకాలం మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆయన చెప్పారు. క్యారెట్ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి మార్కెట్ అందుబాటులోకి వస్తుందన్నారు. రైతులు క్రయవిక్రయాల నిమిత్తం గుడిమాల్కాపూర్, బోయిన్‌పల్లి మార్కెట్‌లకు వెళ్లొదన్నారు. అక్కడి నుంచి కొనుగోలు దారులు (ట్రేడర్స్) ఇక్కడికే వచ్చి వేలం పాటలో పాల్గొంటారన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా క్యారెట్ పండించే రైతులు ఉన్నారని, వారి కోసం మొదలు పెడుతున్నామన్నారు. దీన్ని రైతులందరూ ఉపయోగించుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి సూచించారు. రైతుల కోసం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని అందరూ సహకరించి విజయవంతమయ్యేలా చూడాలని కోరారు.

వేగంగా 'తహసీల్' భవన నిర్మాణం

- పూర్తి కావస్తున్న నిర్మాణ పనులు
- రెండేళ్లుగా పాల కేంద్రంలో సేవలు
- త్వరగా అందుబాటులోకి తేవాలంటున్న ప్రజలు
- జనవరిలో ప్రారంభించే అవకాశం



నిర్మాణంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం

కడ్తాల్: రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేసిన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. 2016 అక్టోబర్‌లో కడ్తాల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి తహసీల్దార్ కార్యాలయాన్ని స్థానిక పాలశీతలీకరణ కేంద్రంలోని రైతు సమావేశ భవనంలో నిర్వహిస్తూ వస్తున్నారు. భవనం ఇరుకుగా ఉండటంతో సిబ్బందితో పాటు సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో నూతన భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

సాగుతున్న పనులు

2021లో అప్పటి ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి రూ.68 లక్షలు డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేసింది. అదే ఏడాది డిసెంబర్ 14న ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే నిధుల కొరతతో పనులను కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేశాడు. దీంతో నిధులు కేటాయించి తహసీల్దార్ కార్యాలయాన్ని అందుబాటులోకి తేవాలని కాంగ్రెస్ నాయకులు పట్టుబట్టారు. ఈ నేపథ్యంలోనే రూ.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. నిధులు విడుదల కావడంతో నిర్మాణ పనులను పునఃప్రారంభించారు. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. జనవరి చివరి వారంలో నూతన కార్యాలయాన్ని ప్రారంభించే యోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

తీరనున్న సమస్య

ప్రస్తుతం ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో ఎలాంటి సౌకర్యాలు లేవని, నూతన భవనాన్ని త్వరగా ప్రారంభిస్తే, సిబ్బందితో పాటు ప్రజలు, రైతులకు సౌకర్యవంతంగా ఉంటుంది. త్వరగా పనులు పూర్తి చేసి, భవనాన్ని త్వరలోనే అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.